ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 17 సెప్టెంబరు 2024

గౌరీలంకేశ్ హత్యకేసులో మరో నలుగురికి బెయిల్

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారిణి, సీనియర్ పాత్రికేయురాలు గౌరీలంకేశ్ హత్యకేసులో మరో నలుగురికి బెయిల్ మంజూరు చేసింది. కేసులో 18మంది నిందితులు ఉండగా ఇప్పటికే నలుగురికి బెయిల్ లభించింది. తాజాగా మరో నలుగురికి బెయిల్ దక్కింది. ఆరో నిందితుడు బెళగావికి చెందిన భరత్ జయవంత్ ఖురానా, తొమ్మిదో నిందితుడు మహారాష్ట్ర రాష్ట్రం సుతారా వాసి సుధన్వ గోంధాలేకర్, 13వ నిందితుడు శివమొగ్గ జిల్లా శికారిపుర సుజిత్‌కుమార్, 16వ నిందితుడు ఔరంగాబాద్‌కు చెందిన శ్రీకాంత్ హొంగార్కర్‌లకు బెయిల్ మంజూరు చేశారు.



యశ్వంతపుర మార్కెట్

ఏపీఎంసీ బలోపేతానికి
సర్కారు కసరత్తు

• తొలివిడతలో 4 రెవెన్యూ డివిజన్లలో కార్యాలయాలు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, దళారుల బెడదనుంచి తప్పించాలని అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లను ఏర్పాటు చేశారు. రైతు వ్యతిరేక చట్టాలతో నష్టాల బాట పట్టిన ఏపీఎంసీలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఏపీఎంసీ మార్కెట్‌ల పాలనా వికేంద్రీకరణ కోసం రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ప్రత్యేక కార్యాలయాలను ప్రారంభించారు. బెంగళూరు, మైసూరు, బెళగావి, కలబురగిలలో డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. వీటికి అనుగుణంగా ప్రతి కేంద్రానికి 7-8 జిల్లాల ఏపీఎంసీ మార్కెట్‌ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. పాలనా వికేంద్రీకరణ మార్గదర్శకాలను సిద్ధం చేశారు. కొవిడ్ కాలంలో రైతులు పంట ఉత్పత్తులను ఎక్కడైనా విక్రయించుకోవచ్చుననే నిబంధనను 2020లో తీసుకొచ్చారు. తద్వారా ఏపీఎంసీ వ్యవహారాలలో భారీగా వ్యాపారాలు తగ్గాయి. కొనుగోలుదారులకు మార్కెట్ సుంకాన్ని 100రూపాయలకుగాను రూ.1.50 నుంచి 60 పైసలకు తగ్గించారు. వీటి ప్రభావం ఏపీఎంసీల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపింది. ఏటా ఏడెనిమిది కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ఏపీఎంసీలకు ఒకటి రెండు కోట్లకు తగ్గింది. మరికొన్ని ఏపీఎంసీలలో వ్యాపారాలు లేక మూసివేసే పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావంతో ట్రేడర్‌లు, కమీషన్ ఏజెంట్లు లైసెన్సులను రెన్యువల్ చేసుకోలేదు. రైతు వ్యతిరేక ఏపీఎంసీ చట్టాలకు సవరణ తీసుకురావడం ద్వారా రద్దు చేశారు. దీంతో వ్యాపార వ్యవహారాలు కొంతమేర మెరుగవుతున్నాయి. ఏపీఎంసీ కార్యకలాపాలలో రూపురేఖలను త్వరలోనే మార్పు చేయదలిచారు. ఇందుకుగాను మార్కెట్ కమిటీ మంత్రిత్వశాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. ఏపీఎంసీ రీజనల్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రధాన కార్యాలయంపై ఒత్తిడి తగ్గడం, సంబంధ విభాగాలలో వ్యాపార వ్యవహారాలు నిర్దిష్టమైన లక్ష్యంతోపాటు ఆదాయం పెంపునకు కారణం కానుంది. రైతులకు గిట్టుబాటు ధర, పారదర్శక కొనుగోళ్లకు అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఏపీఎంసీ మార్కెట్‌లో పాలనలో పారదర్శకత తీసుకురావడం ద్వారా రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చే పంట ఉత్పత్తులలో తూకం, ధరలలో తగిన వ్యవస్థ కల్పిస్తారు. కొనుగోలు చేసిన సరుకుకు సకాలంలోనే రైతుల ఖాతాలకు నగదు బదిలీ చేస్తారు. నగదు బదిలీని ప్రాంతీయ కార్యాలయాలు పర్యవేక్షిస్తాయి. ఇక ఏపీఎంసీలు నష్టాల బాటపట్టాయని ఎంతోమంది వ్యాపారులు లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోలేదు. వాటికి గడువు ముగిసినా మరో అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. అయితే లైసెన్స్ లేకుండా విక్రయాలకు అవకాశం ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఏపీఎంసీ మార్కెట్‌లలో పూర్వవైభవం రానుందని వ్యాపారులు, అన్నదాతలు, సంబంధిత శాఖల ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నెలమంగలలోనే..
ఎయిర్‌పోర్ట్ 2

• అందుబాటులో జాతీయ రహదారి, మెట్రో సర్వీసులు
• నగరానికి 30 కి.మీ దూరం.. రైల్వే లైన్ సమీపంలో..
• ఉత్తర కర్ణాటకవాసులకు అనుకూలం..
• ఎయిర్‌పోర్ట్ అథారిటీకి నివేదిక పంపనున్న ప్రభుత్వం

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరంగా రాణిస్తున్న బెంగళూరుకు రెండో విమానాశ్రయం త్వరలోనే రానుంది. ఇందుకు రెండు నెలలుగా సాగిన కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చింది. దేశంలోనే అతిపొడవైన కన్యాకుమారి నుంచి కశ్మీర్ జాతీయ రహదారికి అనుబంధంగా దేవనహళ్లిలో అంతర్జాతీయ విమానాశ్రయం కొనసాగుతోంది. ఏటా ప్రయాణికుల సంఖ్య, సరుకు రవాణా రెండింతలుగా పెరుగుతూనే ఉంది. ఇక్కడ ఇప్పటికే రెండో టర్మినల్‌ను ప్రారంభించారు. కొత్త టర్మినల్ అంతర్జాతీయస్థాయిలో సర్వాంగసుందరంగా ఉందని ప్రశంసలు పొందింది. అయితే ఏటా ప్రయాణికులు, సరుకు రవాణాకు డిమాండ్ పెరుగుతుండడంతో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ రెండు నెలలక్రిందట సమీక్ష జరిపారు. ఆ తర్వాత సీఎం, డీసీఎంలతోనూ సమీక్షలు కొనసాగాయి. ఆరు ప్రాంతాల్లో సర్వే చేశారు. అయితే అన్నివిధాలా అనుకూలంగా భావించే నెలమంగల - కుణిగల్‌కు అనుబంధంగా ఉండే 75వ జాతీయ రహదారి ప్రాంతాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇదే ప్రాంతంలో రెండో విమానాశ్రయం నిర్మించే ప్రస్తావనను ఖరారు చేయాలని నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ సాంకేతిక నిబంధనలకు అనుగుణంగా స్థలాన్ని ఎంపిక చేశారు. నాడప్రభు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఒత్తిడి పెరుగుతున్న తరుణంలోనే రెండో విమానాశ్రయం ఏర్పాటు ప్రస్తావన రావడం ఆ వెంటనే స్థల పరిశీలన సాగింది. తుది నిర్ణయం తీసుకున్న వెంటనే ఎయిర్‌పోర్ట్ అథారిటీకి నివేదికను పంపాలని ప్రభుత్వం భావించింది. 15 షరతులకు అనుగుణంగానే ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉండే అంతర్జాతీయ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల దూరంలో అవకాశం లేదనే నిబంధనలు 2035తో ముగియనున్నాయి. ప్రస్తుతం ప్రక్రియ ప్రారంభిస్తే గడువు ముగిసేనాటికి పూర్తిస్థాయిలో విమానాశ్రయాన్ని జరిపి ఆ వెంటనే కార్యాచరణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



నెలమంగల సమీపంలోనే ఎందుకంటే..

నెలమంగల సమీపంలోనే రెండవ విమానాశ్రయం ఏర్పాటు నిర్ణయానికి పలు కారణాలున్నాయని చెప్పవచ్చు

- బెంగళూరు దక్షిణ ప్రాంతానికి అనుబంధంగా హారోహళ్ళి - బిడది ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని భావించినా ఇది రింగ్ రోడ్డుద్వారా వెళ్తే తమిళనాడులోని హోసూరుకు సమీపంలో ఉంటుందని వెనుకడుగు వేశారు. హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుకు తమిళనాడు ప్రభుత్వం కసరత్తు సాగిస్తోంది. అటువైపు ప్రస్తావనలు తీసుకెళ్తే రాష్ట్ర భవిష్యత్తులో అభివృద్ధికంటే పొరుగు రాష్ట్రానికి అనుకూలమవుతుందని వెనుకడుగు వేశారు.
- నెలమంగల సమీపంలో నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి 75కు అనుగుణంగా భూమిని గుర్తించారు. ఇప్పటికే నాగసంద్ర దాకా మెట్రో పనిచేస్తోంది. మరోవైపు తుమకూరుకు వెళ్లే రైల్వే మార్గం కూడా ఇక్కడికి సమీపంలోనే ఉంది. జాతీయ రహదారి, రైలు, మెట్రో మార్గాలు అనుసంధానంగా ఉండడంతో ప్రాంతాన్ని ఎంపిక చేయాలని భావిస్తున్నారు.
- బెంగళూరు నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉండడం, నెలమంగల దాకా మెట్రో విస్తరణకు ప్రయత్నాలు సాగుతుండడం, వంటి కారణాలు. బెంగళూరు - మంగళూరు రైల్వేట్రాక్ డబ్లింగ్ ప్రాజెక్టు కొనసాగుతుండడంతో ఓడరేవుల అనుబంధం, సరుకు రవాణాకు అనుకూలం కానుందని భావిస్తున్నారు.
- బెంగళూరు - మంగళూరు జాతీయ రహదారి, బెంగళూరు - పూనె నాల్గో నెంబరు జాతీయ రహదారి అనుబంధంగా ఉంది. ఉత్తర కర్ణాటకకు వెళ్లే మార్గం కావడంతో అక్కడి ప్రజలకు అనుకూలం కానుంది. ప్రస్తుతం నైస్‌రోడ్డు, పెరిఫెరల్ రింగ్ రోడ్డు (పీఆర్ఆర్), శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు (ఎస్‌టీఆర్ఆర్) రోడ్డులు ఇదే ప్రాంతానికి అనుబంధంగా రానున్నాయి. డాబస్‌పేట, తుమకూరు పారిశ్రామికవాడలకు అనుకూలం కానుంది. ఇలా పలు సౌకర్యాల దృష్ట్యా నెలమంగలలో రెండవ విమానాశ్రయ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని చెప్పవచ్చు. సమీప ప్రాంతాల్లో భూముల ధరలు ఇప్పటికే పెరిగిపోయాయని పలువురు పేర్కొంటున్నారు.

డిసెంబరు 27న
ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

• నోటిఫికేషన్ విడుదల

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎన్నికల ప్రక్రియకు అంతా సిద్ధమయ్యింది. 2024 నుంచి 2029 వరకు ఐదేళ్లకుగాను డైరెక్టర్‌లు, పదాధికారులను ఎన్నుకునేలా రాష్ట్ర ఎన్నికల అధికారి హనుమ నరసయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. తాలూకా శాఖ, ప్రణాళికశాఖ, జిల్లా శాఖలకు ఎన్నికలకు జరుగనున్నాయి. మంగళవారం నుంచే బెంగళూరు నగర జిల్లా రాష్ట్ర పరిషత్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 102 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. చివరగా రాష్ట్ర అధ్యక్షుడు, కోశాధికారి స్థానాలకు డిసెంబరు 27న ఎన్నిక జరుగనుంది. అక్టోబరు 9 నుంచి 28వరకు తాలూకా, ప్రణాళికశాఖల కార్యవర్గ కమిటీ డైరెక్టర్‌లను ఎన్నుకుంటారు. అక్టోబరు 30నుంచి జిల్లాలవారీగా అధ్యక్షులు, కోశాధికారుల ఎన్నికలు జరుగుతాయి. అక్టోబరు 28 నుంచి నవంబరు 16వరకు జిల్లాశాఖల కార్యవర్గ సమితి డైరెక్టర్ల ఎన్నిక జరగనుంది. నవంబరు 19 నుంచి డిసెంబరు 4వరకు జిల్లా అధ్యక్షులు, జిల్లా కోశాధికారుల ఎన్నిక జరగనుంది. కాగా సెప్టెంబరు 17 నుంచి డిసెంబరు 4వరకు బెంగళూరు నగర జిల్లాతోపాటు రాష్ట్ర పరిషత్ సభ్యుల ప్రాంతాల వారీగా ఎన్నికలు జరుపుతారు. డిసెంబరు 9 నుంచి 27 వరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు, కోశాధికారి స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రతిష్ఠాత్మకమైన గుర్తింపు ఉంది. ప్రస్తుతం రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా షడాక్షరి వ్యవహరిస్తున్నారు.


ఉద్యోగుల సంఘ కార్యాలయం

నేడు కలబురగిలో కేబినెట్ భేటీ



మీడియా సమావేశంలో మంత్రులు ప్రియాంక ఖర్గే, శరణప్రకాశ్ పాటిల్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటకలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయమై కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం ఉంటుందని ఐటీ బీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే వెల్లడించారు. కలబురగిలో సోమవారం వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్, జిల్లా అధికారి ఫౌజియా తరున్నుమ్, ఎమ్మెల్సీ జగదేవ్ గుత్తేదార్‌లతో కలసి మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కలబురగిలో కేబినెట్ భేటీ ఉంటుందని, పదేళ్ల తర్వాత సీఎం సిద్దరామయ్య కలబురగిలో కేబినెట్ భేటీ జరగనుందన్నారు. రాష్ట్రస్థాయిలో ఆర్థికశాఖ ముందు ఉండే పలు ప్రస్తావనలకు అంగీకారం లభించే అవకాశం ఉందన్నారు. డీసీఎం డీకే శివకుమార్ అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్నారన్నారు. ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ గుజరాత్ పర్యటనకు వెళ్తున్నందున సమావేశానికి హాజరు కాలేరన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి గణేశ నిమజ్జనం వేళ నాగమంగలలో జరిగిన గొడవలను ప్రస్తావించేందుకు సమయం ఉందని, కానీ వారి పార్టీ ఎమ్మెల్యే మహిళలు, దళితుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన అంశాలపై ఎందుకు స్పందించరన్నారు. మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప పోక్సో కేసు, విజయేంద్రపై దాఖలైన కేసుల గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. రిజర్వేషన్‌లకు రాహుల్ గాంధీ వ్యతిరేకమని వ్యాఖ్యానించే పరిషత్ ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రిజర్వేషన్‌లు రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన రామాజోయిస్ ఏ పార్టీకి చెందినవారన్నారు. స్పష్టమైన మెజారిటీ వస్తే రిజర్వేషన్‌లు రద్దు చేస్తామన్న అనంతకుమార్ హెగ్డే ఏ పార్టీకి చెందినవారని ప్రశ్నించారు.

పూల ధరలు తగ్గుముఖం

హోసూరు, సెప్టెంబరు 16: గత నెలలో శ్రావణ మాస పూజలు, పది రోజులుగా వినాయక పూజలతో పూలకు డిమాండ్ బాగా ఉండేది. అయితే రెండు మూడు రోజులుగా పూల ధరలు పడిపోయాయి. పూల మార్కెట్‌కు సరఫరా పెరగడంతో అందుకు తగిన డిమాండ్ లేక ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం కనకాంబరం కిలో రూ.400 చొప్పున విక్రయించారు. చామంతి రూ.200, బంతి పూలు రూ.100 మాత్రమే పలకడంతో రైతులకు నిరాశ తప్పలేదు. మళ్లీ దసరా నవరాత్రుల్లోనైనా పూలధరలు పెరగకపోతాయా అని రైతులు ఎదురు చూస్తున్నారు. తిరువణ్ణామలై, వేలూరు, మదురై, సేలం, కృష్ణగిరి, అంచెట్టి, శూలగిరి, బాగలూరు, బేరికై, రాయకోట, తళి, సరిహద్దులోని అత్తిబెలె, చందాపుర, ఆనేకల్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి పూలను హోసూరుకు విరివిగా తరలిస్తారు. మేరీగోల్డ్, రోజా, జాస్మిన్, బటన్‌రోజా, జర్బరా, గుండుమల్లి, సంపంగి, కనకాంబర వంటి వివిధ రకాల పూలను ఇక్కడ పండిస్తారు. ఇక్కడి నుంచి కర్ణాటక, ఆంధ్ర సహా పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.


విరగ్గాసిన చామంతి పూలు



నగరంలో ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు

రాష్ట్రవ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ సందడి

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఈద్-మిలాద్ సందడి కొనసాగింది. మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని రాష్ట్రమంతటా ముస్లింలు భక్తితో ప్రార్థనలు జరుపుకొన్నారు. ఊరేగింపులు చేసి మహ్మద్ ప్రవక్త సమాజానికి ఇచ్చిన సందేశాన్ని గుర్తు చేసుకున్నారు. బెంగళూరు వ్యాప్తంగా మక్కా మదీనా నమూనాలతో ఊరేగింపు సాగింది. మధ్యాహ్నం నుంచే ర్యాలీ ఆరంభమైంది. మైసూరు రోడ్డు, జయనగర్, ఆర్‌టి నగర్, శివాజినగర్‌తోపాటు నగరంలోని అన్ని ప్రాంతాలనుంచి ఊరేగింపు కొనసాగింది. నృపతుంగ రోడ్డుకు చేరుకున్నాయి. వైఎంసీఏ వద్ద ఏర్పాటైన సమావేశంలో మతపెద్దలు ఖురాన్‌లోని పలు ఘట్టాలను వినిపించారు. నగరవ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఊరేగింపు వేళ ప్రత్యేక నిఘా కొనసాగింది. ఊరేగింపు వేళ అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముందస్తుగా కొన్ని మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్ళించారు. హుబ్బళ్ళి, బీదర్, రాయచూరు, కలబురగి, బెళగావి, బాగల్కోటె, రామనగర, చిత్రదుర్గ, తుమకూరు, కోలారు, ఉడుపి, చిక్కమగళూరు తదితర జిల్లాల్లోనూ వేడుకలు సాగాయి.


బురద నీటిలో పడేసిన విగ్రహాలు

నిన్న ఊరేగింపు..
నేడు చుట్టూ కంపు

• బురదనీటిలోనే గణనాథుడి నిమజ్జనం
• నిర్వాహకులపై ప్రజల ఆగ్రహం

హోసూరు, సెప్టెంబరు 16: వారం రోజులుగా భక్తి శ్రద్ధలతో పూజించారు..సందడిగా ఊరేగింపు నిర్వహించారు..కానీ బురద నీటిలో నిమజ్జనం చేసి చేతులు దులుపుకున్నారు. ఆదివారం పట్టణంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. అయితే నిమజ్జనంలో నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోసూరు పరిసర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన భారీ గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, నదీపరీవాహక ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. అయితే హోసూరు రామనాయకన సరస్సులో నిమజ్జనం చేయగా తగినంత నీరు లేకపోవడంతో భారీ విగ్రహాలను గట్టు సమీపాన వదిలి వెళ్లారు. దీంతో విగ్రహాలన్ని కరగక అలాగే ఉండిపోవడంతో చెత్తాచెదారం చేరి కలుషితంగా మారిపోయింది. ఆ ప్రాంతంలోకి వెళ్లాలంటేనే విపరీతమైన కంపు నెలకొని ఉంది. దీంతో పర్యావరణం దెబ్బతినడమే కాకుండా విగ్రహాలు చేతులు, కాళ్లు, తలలు ఎక్కడ పడితే అక్కడ పడేయడంపై భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తగినంత నీరు లేని చెరువుల్లో నిమజ్జనం చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.


మాస్ కాపీయింగ్‌కు చెక్..

• రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో వెబ్‌కాస్టింగ్ • అన్ని పరీక్షల్లోనూ అమలు: రిజిస్ట్రార్

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చేయాలని, పోటీ పరీక్షల్లో అమలు చేస్తున్న వెబ్‌కాస్టింగ్ విధానం విజయవంతం అవడంతో రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం కూడా కొనసాగించాలని నిర్ణయించారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నియంత్రించాలని పరీక్షా మండలి ఈ ఏడాది తొలిసారిగా వెబ్‌కాస్టింగ్‌ను అమలు చేసింది. తద్వారా పర్యవేక్షణ కేంద్ర కార్యాలయాల్లోనే ఉంటూ రాష్ట్రంలోని అన్ని పరీక్ష కేంద్రాలపై నిఘా కొనసాగించారు. ఏ ప్రాంతంలోని పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్‌తోపాటు ఇతరత్రా సమస్యలు తలెత్తితే వెంటనే కేంద్ర కార్యాలయం నుంచి చర్యలకు ఆదేశించేవారు. ఇటీవలే కర్ణాటక పరీక్షా ప్రాధికార పోటీ పరీక్షల్లోనూ వెబ్‌కాస్టింగ్ నిర్వహించింది. మాస్ కాపీయింగ్‌తోపాటు ఇతరత్రా అక్రమాలకు అవకాశం లేకుండా కట్టడి చేసేందుకు ఇదే సముచితమని భావించి రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయంలోనూ అమలు చేయాలని భావిస్తున్నారు. ఎంబీబీఎస్, నర్సింగ్‌తోపాటు అన్నికోర్సుల పరీక్షల్లోనూ ఇకపై వెబ్‌కాస్టింగ్ విధానం అమలులోకి తీసుకురానున్నట్లు మౌల్యమాపన రిజిస్ట్రార్ ప్రకటించారు. రాజీవ్‌గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో 211 కళాశాలలు ఉన్నాయి. ఒక సెమిస్టర్‌లో 1.5 లక్షలమందికంటే ఎక్కువమంది విద్యార్థులు పాల్గొంటారు. ఇక్కడి విద్యార్థులు కూడా కాపీ కోసం ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయి. పలుమార్లు విద్యార్థులు పట్టుబడ్డారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కట్టడికి అధికారులు తీసుకునే చర్యలను తిప్పికొట్టేలా విద్యార్థులు కూడా కొత్త విధానాలతో కాపీయింగ్‌కు పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. ఇన్విజిలేటర్‌లు ఎంతగా కట్టడి చేసినా మాస్ కాపీయింగ్ అనేది కొనసాగుతూనే ఉంది. వెబ్‌కాస్టింగ్ విధానంతో ఒక్కసారిగా నిఘా పెంచడం వల్ల నియంత్రించేందుకు సాధ్యమవుతోంది. పరీక్షా కేంద్రాల్లో వాయిస్ కమాండ్ ఇచ్చే హెచ్‌డీసీసీ కెమెరాలను అమర్చారు. ఇంటర్నెట్ సాయంతో కెమెరాలను నియంత్రించేలా కేంద్ర కార్యాలయాలు పర్యవేక్షిస్తాయి. విద్యార్థుల కదలికలను పరిశీలించవచ్చు. ఏమాత్రం అనుమానం వచ్చినా కేంద్ర కార్యాలయం నుంచే వాయిస్ కమాండ్ ద్వారా హెచ్చరించేందుకు వీలుంటుంది.



రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,621.49
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	18,737	1732
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	18,137	9,925
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	65.61

గ్యాస్ ఏజెన్సీ ఉద్యోగి ఆత్మహత్య

రాయచూరు సెప్టెంబర్ 16 : జిల్లాలోని మాన్వి పట్టణంలోగల ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్న ఉద్యోగి జిందప్ప(38) ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఆదివారం పట్టణ శివారుల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మాన్వి తాలూకా ఆస్పత్రికి తరలించారు. జిందప్ప మాన్వి తాలూకా సీకల్ గ్రామ చాపడి క్యాంప్ నివాసిగా పోలీసులు గుర్తించారు. జిందప్పతో కలిసి పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు చెబుతున్న వివరాల మేరకు గడచిన 8 ఏళ్లుగా అదే కంపెనీలో పనిచేసున్నా వేతనం పెరగకపోవడంతో మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు. దీనిపై మాన్వి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.


జిందప్ప(ఫైల్)

నేడు శోభాయాత్ర

సిరుగుప్ప, సెప్టెంబరు 16 : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి శోభాయాత్ర మంగళవారం నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తెలిపారు. హైస్కూలు మైదానం నుంచి తుంగభద్ర నది వరకు భారీ ఎత్తున శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ప్రజలు విరివిగా పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని వారు. గణనాథుడి ఆశీస్సులు పొందాలని సూచించారు.

ఆగని అన్నదాత పోరు

● భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి ● కుడితినిలో కొనసాగుతున్న నిరసన

కంప్లి, సెప్టెంబరు 16: తమ భూములు తీసుకున్న కంపెనీలు న్యాయం చేయాలని రైతులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. కుడితిని పరిధిలోని హరిగినదోణి, జానెకుంటి, యర్రంగళి, వేణి వీరాపురం గ్రామాల రైతులు కర్మాగారాలకు భూములు పోగొట్టుకుని రోడ్డు పాలయ్యారు. ఇంతవరకు కర్మాగారాల యాజమాన్యం రైతులతో భూములు తీసుకునే సమయంలో ఇక్కడ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని, భూములు ఇచ్చిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. కానీ రాజకీయ ఒత్తిళ్ల వల్ల సుమారు పదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఏ కర్మాగారం ఏర్పడలేదు. ఉద్యోగాలు కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయపోరాటం కోసం కుడితిని సంఘం రైతు రక్షణ వేదిక, ఇతర సంఘాలు కలసి 635 రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. ఇంతవరకు ఏ నాయకుడు, ప్రజాప్రతినిధి చర్చించ లేదని రక్షణ వేదిక పదాధికరులు సంపత్ కుమార్ తెలిపారు. ఎంతో మంది రైతులు న్యాయ పోరాటం కోసం పగలనక, రాత్రినక కుడితినిలో నిరసనలు చేపడుతున్నా, అధికారులు బళ్లారి నుంచి జేఎస్‌డబ్ల్యూకు వెళ్లి అక్కడి నుంచి సమావేశాలకు హాజరవుతున్నారే గానీ వారికి రైతులు మాత్రం కనిపించడం లేదా అన్నారు. ఇప్పటికైనా రైతులు చేపడుతున్న నిరసనలకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి రైతులను ఆదుకుని రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతన్నలు, సంఘ సంస్థ నేతలు, పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన రైతులు

నేడు విమోచన దినం

రాయచూరు సెప్టెంబర్ 16: కల్యాణ కర్ణాటక ప్రాంత విమోచన దినోత్సవాన్ని ఈనెల 17వ తేదీ మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటీల్ రాష్ట్ర జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లాకు చెందిన రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు తరలిరావాలని జిల్లాధికారి కే నితీశ్ పిలుపునిచ్చారు.

నేటి నుంచి కాంట్రాక్టు కార్మికుల దర్నా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16: ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ బీటీపీఎస్ కాంట్రాక్టు వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్విహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు సత్యబాబు, తిప్పేస్వామి తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బీటీపీఎస్‌లో కనీస వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ఈఎస్ఐ చట్టం 1952, వేతనాల చెల్లింపు చట్టం 1936 ఫ్యాక్టరీ చట్టాలు, ఇతర భద్రతా పరికరాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లైయాస్ బొగ్గు యూనిట్లలో పనిచేస్తున్న కార్మికుల వేతన సవరణ జరగాలి. కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలి. దినపు రోజులు లేదా నెలల్లో టెండర్లు జారీ చేస్తే కొత్త పే బోర్డు వాటిని జారీ చేయాలి. కార్మికులందరికి తగిన భద్రతా పరికరాలు ఉండాలి. భద్రతా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తం ఉద్యమాలకు వెనకాడేది లేదని తెలిపారు.

తాళి కట్టకుండా పరారైన యువకుడు

పెరంబూర్, సెప్టెంబరు 16: వివాహ సమయంలో తాళి కట్టకుండా యువకుడు పరారయ్యాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు బ్యాంక్ అధికారి మురుగేష్ కుమార్తె అనసూయ, అరక్కోణం సమీపం పళనిపేట ప్రాంతానికి చెందిన మాజీ పోలీసు అధికారి గోవిందస్వామి కుమారుడు శ్రీధర్‌ను ప్రేమిస్తోంది. శ్రీధర్ బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరి ప్రేమను ఇరుతరఫు బంధువులు నిరాకరించడంతో, వీరిద్దరు నాలుగేళ్లుగా బెంగళూరులో ఎవరికి తెలియకుండా సహజీవనం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, వీరికి వివా హం చేసేందుకు ఇరు కుటుంబాలు అంగీకరించాయి. తిరుత్తణిలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం జరుగనున్న వివాహ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, తాళి కట్టేందుకు కొన్ని గంటల ముందుగా శ్రీధర్ కల్యాణ మండపం నుంచి అదృశ్యమైనట్లు తెలిసింది. ఈ విషయమై గోవిందస్వామి తిరుత్తణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అనసూయ కూడా తిరుత్తణి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రధానాపోధ్యాయుడికి అవార్డు ప్రదానం


బసవరాజును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 16: బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ 52వ వార్షికోత్సవం, పురస్కార ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బీటీఎస్‌సీ పాఠశాల హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు అందజేశారు. కర్ణాటక హిస్టరీ అకాడమీ జిల్లా అధ్యక్షుడు, కళాకారుడు టి.హెచ్.ఎం.బసవరాజ్‌ను తెలుగు నాటక పితామహుడు కోలాచలం శ్రీనివాసరావు అవార్డుతో సత్కరించారు. ఈసందర్భంగా కళ్యాణ్‌స్వామి, వి.మహిపాల్, సంస్థ చైర్మన్ సీలీ బ్రహ్మయ్యకన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు,బోర్డు సభ్యుడు పి.గాదెప్ప,న్యాయవాది జనార్ధన. ఎస్.పన్నరాజ్, రఘురాం, చిదానంద, వాణిజ్య మండలి సీనియర్ ప్రెసిడెంట్ యశ్వంత్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్ల పంపిణీలో ఎమ్మెల్యే వై ప్రకాశ్ తదితరులు

హోసూరు, సెప్టెంబరు 16: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని సీతారాం ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో 72 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు దేవసేన అధ్యక్షత వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నౌషాద్ అందరికి స్వాగతం పలికారు. డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంల్లో జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు యువరాజ్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, మోసిన్‌తాజ్ నిసార్, ఉపాధ్యాయ సంఘం నిర్వాహకులు అయూబ్‌ఖాన్, నిర్వాహకులు హరిప్రసాద్, దినేశ్, మంజు, ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మంచి వ్యక్తిత్వ ఉపాధ్యాయురాలని పేరొందిన ప్రభాకు శాలువ కప్పి సత్కరించారు.

డీఎంకే ప్రజాప్రతినిధుల సమావేశం

హోసూరు, సెప్టెంబరు 16: హోసూరు యూనియన్ బెళత్తూరు పంచాయతీ సూదాపురం శాఖ తరఫున బాగలూరు సర్కిల్‌లో డీఎంకే సభ్యుల సమావేశం జరిగింది. సమావేశానికి కృష్ణన్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, యూనియన్ ఉప కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు. సమావేశంలో తమిళనాడు ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో రూ.7,300 కోట్లతో కొత్త ఫ్యాక్టరీలు ఏర్పాటుకు చొరవ చూపడంపై ధన్యవాదాలు తెలిపారు. కారు పందేలు నిర్వహించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు అభినందనలు తెలిపారు. హోసూరులో 2 వేల ఎకరాలు విమానాశ్రయానికి ఏర్పాటు చేయాలని అసెంబ్లీల్లో మాట్లాడిన ఎమ్మెల్యే వై.ప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పలు తీర్మానాలను ఆమోదించారు. యూనియన్ మాజీ ఉప కార్యదర్శి బాలాజీ, యూనియన్ మాజీ కార్యదర్శి మునుస్వామి, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బళ్లారిలో ప్రార్థనలు నిర్వహిసున్న మత పెద్దలు


సిరుగుప్పలో ఊరేగింపులో చిన్నారులు

మిలాద్ ఉన్ నబీ సందడి

బళ్లారి సిటీ/రూరల్/సిరుగుప్ప/కంప్లి/రాయచూరు సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త మహ్మద్ జయంతి మిలాద్ ఉన్ నబీ పండగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం నగరంలోని కౌల్‌బజార్‌లో ఉదయం ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పండగ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిలకు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని బల్లారప్ప మసీదు, హుస్సేన్‌నగర్ మసీదుతో పాటు పలుచోట్ల మక్కా-మదీనా స్మారక చిహ్నాల ప్రతిరూపాలను ఊరేగించారు.
ఈద్ మిలాద్ ఊరేగింపులో ముస్లింలు సమాజంలో శాంతిస్ఫూర్తి అందరూ సమానంగా జీవించాలని చాటి చెప్పడమే ఈపండుగ ప్రత్యేకత. ఈరోజు మహమ్మద్ ప్రవక్త జన్మించారని, అదే రోజు మరణించారని చెబుతారు. ముస్లిం సమాజం ప్రజలు ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.
సిరుగుప్ప: ఈద్ మిలాద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా ఈద్ పురస్కరించుకుని ముస్లింలు టిప్పు సుల్తాన్ సర్కిల్ నుంచి హైస్కూలు మైదానం వరకు మహమ్మద్ పైగంబర్ పటాలతో ట్రాక్టర్లలో ఊరేగింపు నిర్వహించారు. యువకులు కోలాహలంతో డ్యాన్సులు చేశారు. కనివినీ ఎరుగని రీతిలో ఉత్సవాలను జరుపుకున్నారు. ఈద్ మిలాద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ నబీ శుభాకాంక్షలను తెలిపారు.
బళ్లారిరూరల్: బళ్లారిరూరల్ గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింలు పండుగను అసోండి, రూపనగుడి, యాల్పి, కుంటనహాళ్, మోకా పలు గ్రామాలలో ఈద్ మిలాద్ పండుగను సాంప్రదాయ ప్రకారంగా గ్రామవీధుల్లో జెండా ప్రార్థన చేస్తూ గ్రామ వీధుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
కంప్లి: కంప్లి పట్టణంలో ముస్లిం ఆరాధ్య పండుగైన ఈద్ మిలాద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొన్నారు. ప్రతి పండుగను ప్రతి సమాజంవారు సంతోషంగా ఐక్యతతో జరుపుకున్నపుడే ఆ సమాజంలో ఐక్యత పెరుగుతుందన్నారు.
రాయచూరు : మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మీలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని నగరంలోని ముస్లిం సోదరులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని నగరంలోని మసీదులన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు రకాల శకటాలతో అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు.


రాయచూరులో..


కంప్లిలో..

అయినా.. వదలరు..!

- నష్టాలు వస్తున్నా పెరుగుతున్న టమోటా సాగు
- రూ. లక్షలు పెట్టుబడి పెడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూపు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16: దిగుబడి బాగున్నా ధర లేక వరుసగా నష్టాలు వస్తున్నా రైతులు మాత్రం టమోటా సాగును వీడటం లేదు. ఏడాదిలో ఒక్కసారి సరైన రేటు తగిలితే చాలు మొత్తం కష్టాలు తీరుతాయన్న ఆశతో ప్రతిసారి సాగు చేస్తూనే ఉన్నారు. ఈక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టమోటా సాగు ఏటేటా పెరుగుతూనే ఉంది. పంటసాగుకు ప్రభుత్వం నుంచి సాయం అందితే కాస్త ఊరట ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

వివిధ పద్ధతుల్లో సాగు

ఉమ్మడి జిల్లాలోని రైతులు వివిధ పద్ధతుల్లో టమోటా సాగు చేస్తున్నారు. సాధారణ పద్ధతిలో పంట సాగు చేస్తే వర్షాలకు దెబ్బతింటోదని మల్చింగ్ షీట్, కట్టెల పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ పద్ధతుల్లో పంట సాగు చేస్తే వర్షాలకు కాయలు దెబ్బతినకపోవడంతో పాటు నిల్వ కూడా సాధారణం కంటే రెండు మూడు రోజులు అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మల్చింగ్ పద్ధతిలో పంట కాలం ముగిసినా అదనంగా నెల..కట్టెల పద్ధతిలో రెండు నెలల పాటు దిగుబడులు వచ్చే వీలుంటుందని చెబు తున్నారు. అందుకే ఈపద్ధతుల్లో పంట సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయితే పెట్టుబడులు కూడా రూ.లక్షల్లోనే అవుతున్నాయి. మల్చింగ్ (పేపర్)పద్ధతిలో ఎకరానికి రూ.50వేల నుంచి రూ.70వేల మధ్య పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మల్చింగ్ తరువాత ఎక్కువగా సాగు చేస్తున్నది కట్టెల పద్ధతి. ఈ పద్ధతిలో పంట సాగుకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మల్చింగ్, కట్టెల పద్ధతిలో సాగుకు రాయితీలు ఇచ్చే వారని, వైసీపీ పాలనలో వీటన్నింటిని ఎత్తివేసినట్లు రైతులు చెబుతున్నారు. వీటిని పునరుద్ధరిస్తే రైతుకు మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు.


కట్టెల పద్ధతిలో సాగు చేసిన టమోటా

ఉపాధికి అనుసంధానించాలి

ఇరవై ఎకరాల్లో టమోటా సాగు చేశా. మల్చింగ్ పద్ధతిలో 15ఎకరాలు, కట్టెల పద్ధతిలో ఐదు ఎకరాల్లో టమోటా సాగు చేశా. కట్టెల విధానంలో పంట కోత కొచ్చే దశలో ఉంది. ఈ పద్ధతి సాగు చేయడానికి ఎకరానికి రూ.80వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట సాగు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 12సార్లు పురుగు మందులు కొట్టా. ఇప్పటికే ఐదు ఎకరాలకు రూ.5లక్షలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరిగిపోయాయి. ఈ పంటను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎరువుల ధరలు తగ్గిస్తే కూడా కొంత వరకు రైతులకు మేలు జరుగుతుంది.

వెంకటరాముడు, రైతు, ఆలమూరు



■ రాయితీలు వస్తే బాగుంటుంది



మల్చింగ్ పద్ధతిలో పంట సాగు చేశా. పంటసాగు మొదలుకొని కోత కొచ్చే సరికి ఎకరానికి రూ.60వేలకుపైగానే పెట్టుబడులు అయ్యాయి. మూడున్న ర ఎకరాల్లో పంట సాగు చేశా. పేపర్ రోళ్లు, వాటిని పరిచేందుకే రూ.12 వేల వరకు ఎకరానికి ఖర్చు అయింది. ఇలా అన్ని అయ్యే సరికి పెట్టు బడులకే రూ.60వేలకు చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీలిస్తే బాగుంటుంది. టీడీపీ పాలనలో మల్చింగ్ పద్ధతిలో సాగుకు హెక్టార్‌కు రూ.10వేల నుంచి రూ.15వేలు సబ్సిడీ వచ్చేది.

- సంజీవులు, రైతు, ఆలమూరు

■ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కనీస మద్దతు ధరతో టమోటాను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు లాభం చేకూరుతుంది. టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. 90శాతం రాయితీతో స్టేకింగ్ (కట్టెల)పద్ధతి సాగుకు అవకాశం కల్పించాలి. నేల మీద సాగుకు పేపర్ షీట్ అందించాలి. టమోటా మార్కెట్‌లో మండీల పర్యవేక్షణ ప్రభుత్వమే చేయాలి. టమోటా ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. మండీల్లో హమాలీ కూలీ, బాక్సుల బాడుగ మండీల నిర్వాహకులే ఇచ్చేవిధంగా చూడాలి.



- చిరుతల మల్లికార్జున, జిల్లాప్రధాన కార్యదర్శి, రైతు సంఘం

■ మార్కెట్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో టమోటా మార్కెట్ ఏర్పాటు చేయాలి. ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖ సమన్వయంతో టమోటా రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం తోపాటు రైతులకు అవగాహన కల్పించాలి. గతంలో మాదిరిగానే ఉద్యాన శాఖ ద్వారా టమోటా విత్తనాలు అందించాలి. ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. జ్యూస్ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకురావాలి. పెట్టుబడుల ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టమోటా కనీసం వారంరోజులు నిల్వ ఉండేవిధంగా నూతన వంగడాలు అందుబాటులోకి తీసుకురావాలి.



- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం


చలువరాజ్ భార్యను పరామర్శిస్తున్న మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్

మరో రెండు ఆడియోలున్నాయ్..

● ఎమ్మెల్యే మునిరత్నకు కాంట్రాక్టర్ చలువరాజ్ షాక్

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు సంబంధించి మరో రెండు ఆడియోలు ఉన్నాయని, త్వరలోనే విడుదల చేస్తానని బీబీఎంపీ కంట్రాక్టర్ చలువరాజ్ వెల్లడించారు. చలువరాజ్ కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పరామర్శించారు. ఇదే సందర్భంగా చలువరాజ్ మీడియాతో మాట్లాడుతూ మునిరత్న కులదూషణ చేశారని, ప్రాణాలు తీస్తామని హెచ్చరించారన్నారు. ఆడియోలో కాంగ్రెస్ నేత హనుమంతరాయప్పతో తాను మాట్లాడింది వాస్తవమన్నారు. వివాదానికి సంబంధించి దర్యాప్తు సాగుతోందని అందుకు సంపూర్ణంగా సహకరిస్తానన్నారు. ఇప్పటికే అరెస్ట్ అయిన ఎమ్మెల్యేకు మరో షాక్ తగిలినట్లయ్యింది. కాగా సోమవారం హనుమంతరాయప్ప ముఖ్యమంత్రి అధికారిక కార్యాలయం కావేరిలో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ పుట్టణ్ణతో కలసి వచ్చారు. మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ చలువరాజ్‌ను ఎమ్మెల్యే తీవ్రంగా దూషించారని, ఆయన భార్య పట్ల అనుచితంగా మాట్లాడారని, సాటి మహిళగా ఓదార్చేందుకు వెళ్లానన్నారు. ఓ మహిళను అసహ్యంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

పెరియార్ ఈవీ రామస్వామి (జయంతి)



'ద్రవిడ ఉద్యమ పితామహ'గా గుర్తింపు పొంది పెరియార్‌గా ప్రసిద్ధి చెందిన ఈరోడ్ వేంకట రామస్వామి 1879 సెప్టెంబరు 17న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. జన్మించారు. ఆత్మ గౌరవం, సాంఘిక సమానత్వం కోసం తపించారు. సామాజికవేత్త, రాజకీయనేతగా రాణించారు. సమాజంలో సమానతకోసం దశాబ్దాలపాటు శ్రమించి ప్రజలలో చైతన్యం కోసం ప్రసంగాలు చేశారు. మహిళా హక్కులు, కుల వ్యవస్థపై పోరాటం చేశారు. 1973 డిసెంబరు 24న కన్నుమూశారు. 2021లో ఆయన జయంతిని 'సామాజిక న్యాయ దినోత్సవం'గా తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

ఎంఎఫ్ హుస్సేన్ (జయంతి)



చిత్రకారుడిగా భారతీయ పికాసోగా పేరొందిన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'పద్మ విభూషణ్' గ్రహీత మక్బూల్ ఫిదా హుస్సేన్ 1915 సెప్టెంబరు 17న మహారాష్ట్ర రాష్ట్రం పండరీపుర ప్రాంతంలో జన్మించారు. చిత్రలేఖనంలో జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 'బాంబే ప్రొగ్రెసివ్ ఆర్టిస్ట్ గ్రూప్' సంస్థాపక సభ్యులలో ఒకరు. ఆయన రచించి దర్శకత్వం వహించిన 'మీనాక్షి - ఏ టేల్ ఆఫ్ త్రీ సిటీస్' సినిమా 2004 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. 1986 నుంచి 1992 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్, రాజా రవివర్మ సహా పలు గౌరవాలు అందుకున్నారు. 2011 జూన్ 9న కన్నుమూశారు.

శివరాజు సుబ్బలక్ష్మి (జయంతి)



ప్రముఖ రచయిత్రి, చిత్రకారిణి శివరాజు సుబ్బలక్ష్మి 1925 సెప్టెంబరు 17న కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరంలో జన్మించారు. ఆమె రచనలకు, చిత్రలేఖనాలకు భర్త బుచ్చిబాబు స్ఫూర్తి నిచ్చారు. ఆమె కథలు అనేక సంకలనాలలో వెలువడ్డాయి. అదృష్టరేఖ, నీలంగేటు అయ్యగారు, తీర్పు వంటివి సీరియల్స్‌గా ప్రచురితమయ్యాయి. గృహలక్ష్మి కంకణం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 2021 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

లాల్గుడి జయరామన్ (జయంతి)



కర్ణాటక సంగీత కారుడు 'పద్మ భూషణ్' గ్రహీత లాల్గుడి గోపాల అయ్యర్ జయరామన్ 1930 సెప్టెంబరు 17న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లాలో జన్మించారు. త్యాగరాజ కృతుల ఆలాపనలో పేరొందారు. ఎంఎస్ గోపాలకృష్ణన్, టీఎన్ క్రిష్ణన్‌ల వయోలిన్ బృందంలో ఆయన ఒకరు. వయోలిన్ వాదనలో ఆయన తనదైన ప్రత్యేకతను చాటుకుని లాల్గుడి బాణిగా పేరొందింది. భరతనాట్య కళాకారులకు ఆయన సంగీతం ఒక ప్రత్యేకతగా ఉండేది. 'శ్రీరంగం' సినిమాకు జాతీయ ఉత్తమసంగీత దర్శకత్వ పురస్కారం దక్కింది. నాద విద్యా తిలక, నాద విద్యా రత్నాకర, సంగీత చూడామణి వంటి పురస్కారాలు అందుకున్నారు. 2013 ఏప్రిల్ 22న కన్నుమూశారు.

నరేంద్రమోదీ (పుట్టినరోజు)



ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 1950 సెప్టెంబరు 17న గుజరాత్ రాష్ట్రం మెహ్సానా జిల్లా వాద్‌నగర్ ప్రాంతంలో జన్మించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేకుండా రెండుసార్లు పూర్తిస్థాయి మెజారిటీతో ప్రధాని పగ్గాలు చేపట్టిన ఘనత వాజ్‌పేయ్ తర్వాత ఆయనకే దక్కింది. పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుని అమలు చేశారు. ఆర్ఎస్ఎస్ నుంచి రాజకీయాల్లో రాణించి. ఎమ్మెల్యేగా, ఎంపీగా వ్యవహరించారు. 2001 నుంచి 2014 వరకు గుజరాత్ సీఎంగా కొనసాగారు. మంచి వక్త, వ్యూహకర్త. ప్రధానిగా చరిష్మా కల్గిన నేతగా నిలిచారు. 2020లో టైమ్స్ మ్యాగజైన్ ప్రకటించిన ప్రపంచంలో వందమంది ప్రభావిత వ్యక్తులలో ఒకరిగా నిలిచారు.

సుబ్బరామిరెడ్డి (పుట్టినరోజు)



ప్రముఖ పారిశ్రామికవేత్త తిక్కవరపు సుబ్బరామిరెడ్డి 1943 సెప్టెంబరు 17న నెల్లూరులో జన్మించారు. 2002 నుంచి 2020 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. అంతకుముందు లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. 2006-08 మధ్యన కేంద్ర గనుల శాఖ మంత్రిగా వ్యవహరించారు. సినీ నిర్మాతగా తెలుగు, హిందీ, తమిళ, సంస్కృత భాషలలో సినిమాలు నిర్మించారు. 1993లో భగవద్గీత సినిమాకు నేషనల్ ఫిల్మ్‌అవార్డు దక్కింది. ఆయన సేవలకు కళా తపస్వి, కళారత్న, కళా సామ్రాట్ వంటి పురస్కారాలతోపాటు గౌరవ డాక్టరేట్ లభించింది. టీటీడీ చైర్మన్‌గా కొంత కాలం వ్యవహరించారు. పలు సమాజసేవా కార్యక్రమాలతో మానవతావాదిగా గుర్తింపు పొందారు.

రవిచంద్రన్ అశ్విన్ (పుట్టినరోజు)



'అర్జున అవార్డు' గ్రహీత క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ 1986 సెప్టెంబరు 17న చెన్నైలో జన్మించారు. ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ తరపున డొమెస్టిక్ క్రికెట్‌లో తమిళనాడు తరపున ఆడారు. ఫాస్టెస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందారు. టెస్టు క్రికెట్‌లో స్పిన్నర్‌గా అత్యధిక ర్యాంకు జాబితాలో నిలిచారు. 2016లో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. 2021లో టెస్టు క్రికెట్‌లో 400 వికెట్లు తీసిన 4వ ఇండియన్‌గా నిలిచారు. కపిల్ దేవ్ తర్వాత టెస్టులలో అత్యధిక వికెట్‌లు తీసిన రెండో వ్యక్తిగా 2022లో తనదైన రికార్డు నెలకొల్పారు. 2024లో ఐసిసి మెన్స్ ప్లేయర్స్ ర్యాంకింగ్‌లో హయ్యెస్ట్ ర్యాంక్ బౌలర్‌గా గుర్తింపు పొందారు.

నేటి నుంచి 'స్వచ్ఛతాహీ సేవ'

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16: జిల్లాలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రారంభం అవుతున్నట్లు డీపీఓ ప్రభాకర్ రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పంచాయతీ కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. యాడికిలో ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ హాజరవుతారన్నారు.

కేరళ తరహా ప్రత్యేక కమిటీ అవసరం లేదు

▸▸ ఫిలించాంబర్ తీర్మానం



మీడియాతో మహిళా కమిషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి చౌదరి, ఫిలించాంబర్ సభ్యులు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కన్నడ సినీరంగంలోని మహిళా కళాకారులపై లైంగిక వేధింపులు, ఇతర సమస్యల పరిష్కారానికి కేరళ తరహా ప్రత్యేక సమితి ఏర్పాటు అవసరం లేదని కన్నడ చలనచిత్ర మండలిలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందుకుగాను పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగా అంతిమంగా ప్రత్యేక సమితి ఏర్పాటు అవసరం లేదని మండలి ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఫైర్ సంస్థ వినతిమేరకు కేరళ రాష్ట్రం తరహాలో ప్రత్యేక సమితి ఏర్పాటుకు సంబంధించి సినీరంగంలోని అన్ని విభాగాల అభిప్రాయాలు ఆలకించినట్టు రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి చౌదరి వెల్లడించారు. ఈమేరకు నగరంలో సోమవారం ఫిలించాంబర్‌లో మండలి సభ్యులు తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. కళాకారులు, డైరెక్టర్‌లు, నిర్మాతలతో జరిపిన చర్చల వేళ పరస్పర భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయన్నారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీకి బదులుగా ఫిలించాంబర్ పరిధిలోనే పరిష్కరించుకోవాలని మెజారిటీ సభ్యుల అభిప్రాయంతో ఏకీభవించామన్నారు. శాండల్‌వుడ్‌లో 'మీ టూ' సమస్య వస్తే ఫిలించాంబర్ పరిధిలోనే చర్చించి పరిష్కరించాలని పలువురు సూచించారు. సమావేశంలో ఫైర్ సంస్థ అధ్యక్షురాలు, డైరెక్టర్ కవితా లంకేశ్, నటి నీతూశెట్టి, భావన రామణ్ణ, సంజనా గల్రాని, తార అనురాధ, ఫిలించాంబర్ మాజీ అధ్యక్షుడు సా రా గోవిందు, ఉపాధ్యక్షుడు ప్రమీళా జోషాయ్, నిర్మాత చన్నేగౌడ, రాక్‌లైన్ వెంకటేశ్, కరిసుబ్బు, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత



స్థానిక ప్రముఖులకు సన్మానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 16: భగవంతుడిని పూజించడం ద్వారా మానసిక ప్రశాంతత, తృప్తి ఉంటాయని మళ్ళూరు గ్రామానికి చెందిన రామకృష్ణ వివేకానంద ఆశ్రమ పూర్ణానందస్వామిజీ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బెళ్ళూటిగేట్ గుట్ట ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె ఆధ్వర్యంలో నమ్మూరు - నమ్మకెరె అభివృద్ధిలో భాగంగా బాగుచేసిన చెరువుల అప్పగింత, సామూహిక లక్ష్మీపూజ, ధార్మిక సభ కార్యక్రమాలు జరిగాయి. చెరువు అభివృద్ధి సమితి, ఇతర సంస్థల పదాధికారులు పాల్గొన్నారు. స్వామిజీ మాట్లాడుతూ ఇళ్లల్లో దైవనామస్మరణ, సంప్రదాయాలు పాటించడం, అన్నదానం చేయడం వంటివి ద్వారా అక్కడ శివపరమాత్ముడి ఉంటాడనేది శాస్త్రంలో పేర్కొనబడిందన్నారు. ధర్మస్థళ గ్రామాభివృద్ధి ట్రస్టు జిల్లా యోజనాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ సమాజసేవ కార్యక్రమాల్లో భాగంగా చెరువులలో పూడికతీత చేస్తున్నామని, తాలూకాలో 20 చెరువులలో పూడిక తీశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాదిరూపాయల ఖర్చుతో 790 చెరువుల్లో పూడికతీత సాధ్యం చేశామన్నారు. అభివృద్ధి చేసిన చెరువును తాలూకా తహసీల్దార్‌కు అప్పగించారు. ఇదే సందర్భంగా స్థానిక ప్రముఖులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీఎన్ స్వామి, బెళ్ళూటి రైతుసంఘం జిల్లాధ్యక్షుడు మునికెంపణ్ణ, బెళ్ళూటి సామూహిక లక్ష్మీపూజా సమితి అధ్యక్షుడు సురేశ్, గ్రామపంచాయతీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీల అభివృద్ధిలో పాడిరైతుల పాత్ర కీలకం



రైతులతో వ్యవసాయ అధికారులు

హొస్కోటె, సెప్టెంబరు 16: డెయిరీల అభివృద్ధిలో పాడిరైతుల పాత్ర కీలకమని బముల్ హొస్కోటె క్యాంప్ డిప్యూటీ మేనేజర్ శివాజినాయక్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కొళతూరు గ్రామంలో సోమవారం పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం 2023-24 వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఏవైనా పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడ్డాయన్నారు. ప్రస్తుతం ప్రతి లీటరు పాలకు ప్రభుత్వం రూ.5 ప్రోత్సాహధనం ఇస్తోందన్నారు. కాగా ప్రతి లీటరుకు రూ.5 ధర పెంచడం ద్వారా సదరు మొత్తాన్ని పాడిరైతులకు ఇచ్చేలా యోచిస్తోందన్నారు. ఇది అమలైతే పాడిరైతులకు మరింత వరం కానుందన్నారు. ప్రతి పాడిరైతు నాణ్యమైన పాలకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నందిని ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నట్టుగానే పాలకు కూడా ఉందని అందుకు తగినట్టుగా నాణ్యమైన పాలు అందించాలన్నారు. ప్రధానంగా ఆవులకు శాస్త్రీయంగా పౌష్టికమైన దాణాను అందించడంతోపాటు ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. డెయిరీ అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. 90మందికిపైగా సభ్యులు క్రియాశీలకంగా ఉంటూ ప్రతిరోజూ పాలు అందిస్తున్నారన్నారు. తాలూకాలో పాల దిగుబడిలో ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. ప్రస్తుత ఏడాది రూ.7.5లక్షల లాభం గడించడం పాడిరైతుల శ్రమకు తగిన ఫలమన్నారు. రానున్న రోజుల్లో పశువులకు నందిని దాణా అందేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముగ్గురికి పాల క్యాన్‌లను పంపిణీ చేశారు. సమావేశంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వెంకటాచలయ్య, కొళతూరు డెయిరీ ఉపాధ్యక్షుడు వెంకటరాజు, బముల్ హొసకోటె క్యాంప్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీరామ్, సంతోష్, డైరెక్టర్‌లు సోమశేఖర్, అశోక్, రామాంజిని, ఆంజినప్ప, పద్మ, అనితా తదితరులు పాల్గొన్నారు.

వెదురుతో పర్యావరణానికి ఎంతో మేలు



వెదురు సంబరంలో ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెదురు వైవిధ్యం, సుస్థిరతపై రెండు రోజులపాటు వెదురు సంబరం 2024 నిర్వహించారు. సెంటర్ ఫర్ గ్రీన్ బిల్డింగ్ మెటీరియల్ అండ్ టెక్నాలజీ చైర్మన్ నీలం మంజునాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అటవీశాఖ అధికారి డాక్టర్ బ్రిజేశ్‌కుమార్ దీక్షిత్ ముఖ్యులుగా పాల్గొన్నారు. వెదురు ద్వారా ప్రకృతిలో ఎన్నో విధాలుగా ప్రయోజనాలు ఉన్నాయని బ్రిజేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సుస్థిరమైన జీవనశైలికి ఇదో సహకారం కానుందన్నారు. వెదురు పెంపకానికి ప్రత్యేక పర్యవేక్షణ అవసరం లేదని వెదురు ద్వారా ఇంటీరియర్ డిజైన్, ఎన్నో వస్తువులు తయారు చేయవచ్చునన్నారు. నీలం మంజునాథ్ మాట్లాడుతూ వెదురు సంస్కృతిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వెదురు నగరం పేరిట సి-40 సిటీస్ ఉమెన్ ఫర్ క్లైమేట్ పేరిట ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. బెంగళూరు జనాభా పెరుగుతోందని ఒకప్పుడు నగరంలో పలుచోట్ల వెదురు కనిపించేదని, ఇటీవల కనుమరుగవుతోందన్నారు. నగరంలో అందుబాటులో ఉండే ప్రతిచోటా వెదురును పెంచేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు.

పట్టణంలో మిలాద్ ఉన్ నబీ సందడి



విజయపుర పట్టణంలో ఊరేగింపు ఇలా..

విజయపుర, సెప్టెంబరు 16: ముస్లిం ప్రవక్త పైగంబర్ పుట్టినరోజును స్మరిస్తూ పట్టణం లోని మసీదులలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఇళ్లల్లోనూ ఖురాన్ చదువుతూ ప్రార్థనలు కొనసాగించారు. పలు కూడళ్లలో బావుటాలు ప్రదర్శించారు. మహ్మద్ ప్రవక్త సందేశాలను మౌల్వీలు వినిపంచారు. నూతన వస్త్రాలు ధరించి మిఠాయిలు చేసుకుని చుట్టుపక్కలవారికి పంచిపెట్టారు. పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. మక్కా మదీనా నమూనాలతో ఊరేగింపు సాగింది. అవాంఛనీయ సంఘటనలు లేకుండా మసీదులు, కూడళ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పురసభ మాజీ సభ్యుడు ముబారక్ మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ పైగంబర్ ఇచ్చిన సందేశాలను తెలియచేయడమే పండుగ ఉద్దేశ్యమన్నారు.

నాటు తుపాకీల స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఆయుధాలు



బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీలను అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తినుంచి చామరాజనగర జిల్లా హనూరు పరిధిలోని రామపుర పోలీసులు అరెస్టు చేశారు. హనూరు తాలూకా మార్టల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నందనపాళ్యకు చెందిన మహిమ్మె నాథన్ అలియాస్ మీసెరాజును అరెస్టు చేశారు. ఖచ్చితమైన సమాచారం మేరకు కొళ్ళేగాల డీఎస్పీ ధర్మేంద్ర, ఇన్‌చార్జ్ సీఐ శశికుమార్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. ఆయుధాలను ఎవరు అక్రమంగా కలిగి ఉన్నా నేరమేనని అధికారులు హెచ్చరించారు. ఆయుధాల అక్రమంగా కలిగి ఉన్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వివరాలు తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

రైతులకు తప్పని తిప్పలు

- ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ ఆలస్యం
- జాయింట్ ఎల్‌పీ నంబర్లతోనే సమస్య
- కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ

బొమ్మనహాళ్, సెప్టెంబరు 16: మండలంలో ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ-క్రాప్ బుకింగ్ వంద శాతం పూర్తయిందని చెబుతున్నారు. అయితే జాయింట్ ఎల్‌పీ నంబర్లు రెవెన్యూ వ్యవసాయాధికారుల వద్ద వేర్వేరుగా ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రెవెన్యూ అధికారుల అలసత్వం వల్ల రైతులు ప్రభుత్వ పథకాలకు దూరం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గత వైసీపీ పాలనలో నలుగురు, ఐదుగురు రైతులకు కలిపి ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలలో రీసర్వే జరిగింది. అయితే కొందరికి ఎల్‌పీ నంబర్ల సమస్య ఏర్పడింది. వ్యవసాయ శాఖ అధికారులు 1460 జాయింట్ ఎల్‌పీ నంబర్లను ఈ క్రాప్ బుకింగ్ చేశామని చెబుతున్నారు. అయితే 1135 మాత్రమే జాయింట్ ఎల్‌పీ నంబర్లు ఉన్నాయని సర్వేయర్ అంటున్నారు. ఈ ఎల్‌పీ నంబర్ల సమస్య కారణంగా పంట నమోదు, ఈ-కేవైసీ కావడం లేదని రైతులు ఆందోళన చెందుతు న్నారు. లాగిన్ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు వీలున్నా కొందరు వీఆర్వోలు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 25వేల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. జాయింట్ ఎల్‌పీ నంబర్లు 1460 ఉండగా ఖాతా నంబర్లు 4632 ఉన్నాయి. అయితే జాయింట్ ఎల్‌పీ నంబర్లు ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించి వందశాతం ఈ-క్రాపింగ్ పూర్తి చేశామని అధికారులు అంటు న్నారు. కానీ రైతులు జాయింట్ ఎల్‌పీ నంబర్ల సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ ఇలా..

సాధారణంగా వ్యవసాయాధికారులు రైతు పొలం వద్దకు వెళ్లి ఈ- పంట నమోదు చేయాలి. అప్పుడు రైతుల రిజిస్టర్డ్ మొబైల్‌కు సమాచారం వస్తుంది. అందులో నమోదు చేసిన అంశాల ప్రకారం ప్రక్రియ పూర్తయినట్లుగా భావించాలి. ఇదంతా పూర్తయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రైతుకు పరిహారం లభిస్తుంది. ఎక్కడైనా సమస్య ఉంటే ఆ భూమి దగ్గరికి వీఆర్వో వెళ్లి ఏ రైతు పేరుతో ఉందో గుర్తించాలి. దీనికి సర్వేయర్ సర్వేనంబర్ సరిగ్గా ఉందో లేదో చెప్పాలి. ఆ భూమిలో వేసిన పంట వద్దే సంబంధిత రైతు ఫొటోను వ్యవసాయాధికారి తీసి ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే వీఆర్వోలు భూమి వద్దకు వెళ్లకుండానే రోడ్లపైనే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నా రన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో రికార్డు తప్పుగా నమోదైతే నష్టం జరిగినపుడు నష్టపరిహారం అందే అవకాశం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత రీసర్వే తంటా వల్ల జాయింట్ ఎల్‌పీ నంబర్ల కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు

గుండెపోటుతోనే ఎస్ఐ పరశురామ్ మృతి



ఎస్ఐ పరశురామ్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరి సబ్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ అనుమానాస్పద మృతిపై సాగిన గందరగోళానికి తెరపడింది. పరశురామ్ ఆత్మహత్య చేసుకోలేదనీ, గుండెపోటుతో మృతి చెందాడని ఆదివారం బహిర్గతమైన ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. అనుమానాస్పద మృతిగా ప్రచారం కావడంతో పరశురామ్ దేహం నుంచి వివిధ అవయవాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. పరీక్షల్లో ఆయన శరీరంలో ఎటువంటి విషాహారం అంశాలు లేవని స్పష్టం చేశారు. గుండెపోటుతో మృతి చెందినట్టు నివేదిక ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు కారణమైంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ఆగస్టు 2న పరశురామ్ మృతి చెందారు. గడువుకు ముందే బదిలీ చేశారని పరశురామ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరి ఎమ్మెల్యే చన్నారెడ్డి పాటిల్ తున్నూరు, ఆయన కుమారుడు సన్నిగౌడలు రూ.30 లక్షలు లంచం డిమాండ్ చేశారని ఇదే కారణంతోనే పరశురామ్ మృతి చెందారని కుటుంబీకులు ఆరోపించారు. ఎమ్మెల్యేపై కులదూషణ ఆరోపణ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్న సీఐడీ ఎఫ్ఎస్ఎల్ నివేదికను వెల్లడించారు. పరశురామ్ సోదరుడు హనుమంతు, భార్య తండ్రి వెంకటస్వామిలు సీబీఐ దర్యాప్తు కోరారు. సీఐడీపై విశ్వాసం చూపాలని హోం మంత్రి పరమేశ్వర్ సూచించిన మేరకు అంగీకరించామని ఏం జరుగుతుందో వేచి చూస్తామన్నారు.

నిర్మాణరంగాలకు నాణ్యమైన ప్లైవుడ్

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధునికతకు అనుబంధంగా నిర్మాణరంగంలో మార్పులు వస్తున్నాయని వాటికి తగ్గట్టుగానే ప్లైవుడ్ నాణ్యత విషయంలో రాజీ లేకుండా సమకూరుస్తున్నామని డ్యూరోప్లై ఎండీ సీఈఓ అఖిలేశ్ చిట్లాంగియా వెల్లడించారు. ఈమేరకు నగరంలో సోమవారం రోమా కలెక్షన్‌లపై ఒక ప్రకటన విడుదల చేశారు. ప్లైవుడ్ రంగంలోనూ ఎన్నో సంస్థలు మార్కెటింగ్‌లోకి వచ్చాయని అయితే డై చేసిన వెనీర్‌లు, ఇటలీ ఆర్కిటెక్చర్‌లకు అనుగుణంగా నాణ్యతకు ప్రాధాన్యతకు ఇస్తున్నామన్నారు. నేచర్స్ సిగ్నేచర్ బ్రాండ్‌ను విడుదల చేశామన్నారు. నివాసాలు, కార్యాలయాలు, విల్లాలు, అపార్ట్‌మెంట్‌లకు అనుగుణంగా ఆకర్షణీయమైన రంగులతో వెనీర్‌లు తెచ్చామన్నారు. ప్లాటినమ్ కాఫీతోపాటు వివిధ దేశాల ప్రజల ఆకట్టుకునేలాంటి డిజైన్‌లు తెచ్చామన్నారు.

ఆగ్రహించిన అన్నదాత

- విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం...
- సబ్‌స్టేషన్ ముట్టడి
- అధికారులపై మండిపాటు



ఏఈ రాజారావుతో వాగ్వాదం చేస్తున్నరైతులు

యాడికి, సెప్టెంబరు 16: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిట్టూరు, చిక్కేపల్లి గ్రామాల రైతులు సోమవారం నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి 9గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం చెబుతున్నా ఇక్కడి ట్రాన్స్‌కో అధికారులు అమలు చేయడం లేదన్నారు. స్థానిక అధికారులు వ్యవసాయానికి ఇష్టానుసారంగా కరెంట్ సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి పూట, తెల్లవారుజామున విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 7 గంటలే కరెంట్ సరఫరా చేస్తున్నారని, అది కూడా అంతరాయంతో సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పంటలు ఎండబెట్టుకోవాల్సి వస్తోందని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారని సమాచారం అందుకున్న పోలీసులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ట్రాన్స్‌కో ఏఈ వచ్చి వివరణ ఇచ్చేదాకా కదిలేది లేదని రైతులు తెలిపారు. సబ్‌స్టేషన్ వద్దకు ఏఈ రాజారావు వచ్చి రైతులకు సర్దిచెప్పారు. సబ్‌స్టేషన్‌లో చిన్నచిన్న మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతోందని తెలిపారు. మరమ్మతులు పూర్తికాగానే అంతరాయం లేకుండా వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తామని తెలిపారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతంగా చేపడతామని ట్రాన్స్‌కో అధికారులను రైతులు హెచ్చరించారు.